ఉత్సాహంగా బడిబాట



విజమూరు జెడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు



సీతారామపురం: ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

సీతారామపురం: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. 52 రోజుల పాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. నిన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న పాఠశాలలు విద్యార్థుల రాకతో సందడిగా మారాయి. గత ప్రభుత్వం ముందస్తుగా సిద్ధం చేసి పంపిన స్టూడెంట్స్ కిట్లను విద్యార్థులకు ఉపాధ్యాయులు అందజేశారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులతో పాటు ఉచితంగా పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను పంపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సందడితో పండగ వాతావరణం నెలకొంది. ఓ వైపు కొత్త అడ్మిషన్లు.. మరోవైపు విద్యార్థులకు పుస్తకాల కిట్ల పంపిణీ హడావిడి కనిపించింది.

ఆత్మకూరు: వేసవి సెలవుల అనంతరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు పాఠశాలల్లో విద్యార్థుల సందడి నెలకొంది. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈఓ గోపాల్ నేతృత్వంలో హెచ్ఎం అనంతలక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున విద్యార్థులకు పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ గోపాల్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు పుస్తకాలతో పాటు విద్యా సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తెరుచుకున్నారు. తొలిరోజు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ముందస్తుగా పంపిణీ చేసిన కిట్లను ఉపాధ్యాయులు అందజేశారు. తరుణవాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ విద్యార్థులకు కిట్లను అందచేశారు.



వింజమూరు జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



సంగం: విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ...

ఉపాధిహామీ పనుల పరిశీలన

మర్రిపాడు: మండలంలోని నందవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పీ వెంకటనారాయణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి ప్రభుత్వం ప్రకటించిన దినసరి వేతనం రూ.300 పొందాలని సూచించారు. జాబ్ కార్డుల్లో ఒకరి పేరు ఉంటే మరొకరు పనికి రాకూడదన్నారు. పని ప్రదేశంలో కూలీలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్ ఖాదర్‌బాషాకు సూచించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పనికి వచ్చేలా చూడాలన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

పచ్చిరొట్టతో భూమి సారవంతం

అనుమసముద్రంపేట : పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి కలయదున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయశాఖ అధికారిణి వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని కొండమీద కొండూరు ఆర్‌బీకేలో పచ్చిరొట్ట పైర్లపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్టతో భూమి సారవంతంగా మారడమే కాకుండా సేంద్రియ కర్బన శాతం పెరిగి పంటలకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయని తెలిపారు. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక లాభాలు పొందుతారన్నారు. పచ్చరొట్ట పైర్లను పశువులకు ఆహారంగా వేయడం వల్ల మంచి ఆరోగ్యంగా ఉండి పాల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ఆమె వెంట సర్పంచ్ సరస్వతమ్మ, సిబ్బంది సుబ్బరాయుడు, బీబీజాన్, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకట లక్ష్మి

ఆక్రమణల చెరలో శ్మశాన వాటికలు



హిందూ శ్మశాన స్థలాన్ని ఆక్రమించి పశుగ్రాసం సాగు చేస్తున్న దృశ్యం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలోని శ్మశాన వాటికలు ఆక్రమణల చెరలో ఉన్నాయి. హిందూ, ముస్లిం శ్మశాన వాటికలు రెండూ ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తులు అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామంలో శివాలయానికి తూర్పువైపున 1.40 ఎకరాల హిందూ శ్మశాన వాటిక ఉండేది. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక వైపున 0.50 ఎకరాల ముస్లిం శ్మశాన వాటిక ఉండేది. ప్రస్తుతం రెండూ శ్మశాన వాటికలను కొందరు ఆక్రమించి పశుగ్రాసం సాగు చేస్తున్నారు. దీంతో హిందువులు శ్మశాన వాటిక పక్కనున్న కోనేరు బాటపై దహన సంస్కారాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి శ్మశాన స్థలాలకు హద్దులు చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్యాణ వేదిక నిర్మాణానికి భూమి పూజ

బిట్రగుంట: బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్‌లోని షిర్డీ శేషసాయిబాబా మందిర ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి సాయి భక్తులు గురువారం భూమిపూజ చేశారు. భక్తులు సామూహిక భజనలతో పాటు కల్యాణోత్సవాలను నిర్వహించుకునేందుకు వీలుగా దాతల సహకారంతో కల్యాణ మండప నిర్మాణం చేపడుతున్నట్లు మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం చెప్పారు. బాబా ఆశీస్సులతో వీలైనంత త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేస్తున్న దృష్ట్యా 5 నుంచి 18వ వార్డు వరకు, అలాగే 21వ వార్డులోనూ నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం



ఆత్మకూరు: యూకేజీ సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం చిన్నారులను సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. పాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను పిలిపించి బాధ్యతగా ఆయా పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ రమణమ్మ, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో వార్షిక వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మహాగణపతి హోమం, ఆంజనేయస్వామికి 108 లీటర్ల పాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణాన్ని తిలకించారు. కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా పొన్న వాహన సేవ

కొండాపురం: మండలంలోని కొమ్మిలో సీతారాముల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఐదోరోజు గురువారం ఉదయం యాదవ కులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీరాముడ్ని శ్రీకృష్ణుడిగా అలంకరించి పొన్నమాను వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

- సత్యవోలు పంచాయతీ పరిధిలోని లింగన్నపాళెంలో సీతారాముల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం ఉత్సవాలకు అంకురార్పణ, ఆలయశుద్ధి, విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు.



లింగన్నపాళెంలో విశేషాలంకరణలో సీతారాములు



అల్లూరులో సీతారాముల కల్యాణోత్సవం

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువులో కోదండరామస్వామి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, విశేషాభిషేకాలు, సాయంత్రం అంకురార్పణ, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం



సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పలువురు యువకులు గురువారం పాలాభిషేకం చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా వైఎస్సార్ విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించకపోవడంతో గ్రామానికి చెందిన యువకులు స్పందించారు. ముసుగు తొలగించి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు.

బట్టేపాడు సొసైటీ చైర్మన్ రాజీనామా



ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు సొసైటీ చైర్మన్ బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ నెల్లూరు వారికి లిఖిత పూర్వకంగా తన రాజీనామా లేఖను పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని దానిని ఆమోదించాలని కోరారు.

మర్యాదపూర్వకంగా...



ఉదయగిరి: రాష్ట్ర నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణను ఉదయగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాకర్ల సురేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ఇరువురు మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో వెనుకబడిన ఉదయగిరి ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం


సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రెహమాన్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోగా మోడల్‌స్కూల్‌లో సమర్పించాలని కోరారు. 20న ప్రవేశపరీక్ష ఉంటుందని, అందులో ప్రతిభకనబరిచే విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలాధివాసం



ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో కొలువైయున్న పతివ్రతమ్మతల్లి జలాధివాసాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల పతివ్రతమ్మతల్లి ఆలయంలో నూతన మూలమూర్తిని ప్రతిష్ఠించారు. గతంలో ఉన్న మూలమూర్తి విగ్రహాన్ని మేళతాళాల నడుమ భక్తులు ఊరేగింపుగా పెన్నానది వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి హజరత్తయ్యశర్మ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు



చామదలలో విశేషాలంకారంలో సాయిబాబా

జలదంకి: మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాకలోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సంధ్యాహారతి, 8 గంటలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయిబాబాను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, 8 గంటలకు పల్లకిసేవ నిర్వహించారు.

వైభవంగా వెంగమాంబకు పల్లకిసేవ



దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో గురువారం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. వెంగమాంబ దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి దేవస్థానం చుట్టూ ఊరేగించారు. అమ్మవారి పల్లకిని మోసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఉషశ్రీ మాట్లాడుతూ వెంగమాంబకు ప్రతి గురువారం పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్ సేవలు



సీతారామపురం: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ



వరికుంటపాడులో..

వరికుంటపాడు: ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 48 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందజేశారు. రక్తహీనతకు గురవకుండా గర్భిణులు క్రమం తప్పకుండా ఐరన్‌మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని తురకపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను గురువారం అందించారు. వైద్యాధికారిణి భవ్యశ్రీ 75 మంది రోగులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

దాసరపల్లిలో విషజ్వరాల విజృంభణ

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లిలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పలువురు గ్రామస్తులు విషజ్వరాలతో బాధపడుతున్నారు. రక్తకణాలు పడిపోవడంతో పలువురు నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు, తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ వైద్యశాలల్లో చేరి చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతుండడంతో అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. వైద్యారోగ్య సిబ్బంది స్పందించి వైద్యశిబిరం నిర్వహించి జ్వరాల బారినుంచి ప్రజలను కాపాడాలని కోరారు. పంచాయతీ పాలకులు స్పందించి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దాసరపల్లిలో రోడ్డుపై నిల్వ చేరిన మురుగు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణంలోని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ట్రస్టు నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డుకు చెందిన జ్యోతిలక్ష్మి, 16వ వార్డుకు చెందిన సయ్యద్ ఫాతిమా, 18వ వార్డుకు చెందిన సయ్యద్ సాహెబ్‌జాదా, 19వ వార్డుకు చెందిన పుట్టం పుల్లమ్మ, 21వ వార్డుకు చెందిన గౌరమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నగదు చెక్కులు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

28 నుంచి మానసాదేవి ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి ఆలయ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చల్లా తిరుపతయ్య పేర్కొన్నారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, 29న మానసాదేవి హోమం, చండీ హోమం, విశేష పూజలు, గ్రామోత్సవం, 30న వాల్మీకి పూజ, కుంకుమార్చన, బండ్ల పొంగళ్లు, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ధర్మకర్త, చల్లా యగ్నేశ్వరరావు, వైస్‌చైర్మన్ చల్లా మాల్యాద్రి, ఆలయ అర్చకులు ప్రవీణ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్



సీతారామపురం: వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యసిబ్బంది



వరికుంటపాడులో..

ఆత్మకూరు: క్షయ వ్యాధి నియంత్రణే లక్ష్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో పలువురికి గురువారం బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వయోజనులతో పాటు 18ఏళ్లు నిండిన షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- చేజర్ల మండలంలో మడపల్లి, గొల్లపల్లి, ఆదూరుపల్లి పీహెచ్‌సీల్లో వైద్యసిబ్బంది అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. గ్రామాల్లోనూ ఆశా వలంటీర్లతో కలిసి వైద్యారోగ్య సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు.

275 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లి, సీతారామపురం, బసినేనిపల్లి, అయ్యవారిపల్లి, బాలాయపల్లి, నెమళ్లదిన్నె, పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి గ్రామాల్లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది 275 మంది వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. అరవై ఏళ్లు పైబడిన వారికి క్షయ వ్యాధి సోకకుండా ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, పీహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

273 మందికి వ్యాక్సిన్లు

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 273 మంది వయోజనులకు వైద్యారోగ్య సిబ్బంది అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. సీహెచ్ఓ రాజశేఖరరాజు తూర్పుబోయమడుగులలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



చేజర్ల మండలం మడపల్లిలో..